పుస్తక సమీక్ష : కుటుంబరావు సాహిత్యం

యుద్ధసంస్కృతికి అద్దంపట్టిన కథలు

గొప్ప రచన అంటే ఏమిటి అన్న ప్రశ్నకు ఎవరి చాపల్యాన్ని అనుసరించి వారు ఎన్ని సమాధానాలయినా ఇయ్యవచ్చును గాని, చరిత్రలో ఆ ప్రశ్నకు ఒకే సమాధానం ఉంది. సమకాలీన సమాజంలో వస్తూన్న మార్పులను, చరిత్రాత్మకమయిన పరిణామాలను, ఆ వర్తమానంలో గోచరించే భవిష్యత్తును, ఆ తరంవారికీ తరువాతి తరాలవారికీ కళ్ళకు కట్టినట్టు చూపించే రచన గొప్ప రచన. ఇట్లా చూపించడం అనుకున్నంత సులభం కాదు. ఎందుచేతనంటే మనచుట్టూ కనిపించే మార్పులలో ఏవి చరిత్రాత్మకమయినవో తెలుసుకోవడానికి చాలా నిశితమయిన పరిశీలన కావాలి. చూడడానికి ప్రధానంగా కనిపించేవి నిజానికి చరిత్ర దృష్టిలో ప్రధానం కాకపోవచ్చు. 'మాలపల్లి' నాటికి ఫ్యూడలిజం పతనం ముఖ్యమయిన పరిణామమన్న విషయం ఇవ్వాళ మనం సులభంగా గుర్తిస్తాం గాని, శాస్త్రీయ సామాజిక దృక్పథం లేని ఉన్నవ ఆ విషయాన్ని ఆనాడే గుర్తించి, ఆ పతనాన్ని—తన పరిమితుల పరిధిలోనే-చిత్రీకరించడం ఆయన గొప్పతనం.

అటువంటి మరొక గొప్ప రచయిత కుటుంబరావు. పెట్టుబడిదారీ పారిశ్రామిక విప్లవం పందొమ్మిదవ శతాబ్దపు లండన్ నగరంలో సృష్టించిన అధో ప్రపంచాన్నీ, ఆ ప్రపంచపు సంస్కృతిని,డికెన్స్ తన నవలల్లో ఎంత శాశ్వతంగా పొందుపరిచాడో, ఈ శతాబ్దపు మూడవ, నాల్గవ, దశాబ్దపు పట్టణ మధ్యతరగతి జీవితంలోని మార్పును కుటుంబరావు అంత శాశ్వతంగాను తన కథల్లో పొందుపరిచాడు. ఆనాటి లండన్ గురించి తెలుసుకోవాలన్నా ఈనాటి కోస్తా ఆంధ్ర గురించి తెలుసుకోవాలన్నా చరిత్రకారులను ఆశ్రయించవలసిన అవసరం లేదనిపించగలిగినంతటి చక్కటి రచయితలు ఇద్దరూ.

అటువంటి కుటుంబరావు రచనలను సంకలనం చేసి ప్రచురించాలన్న ఆలోచన చాలా మంచిది. అందుకు 'విశాలాంధ్ర'ను, సంపాదకులు కేతు విశ్వనాథరెడ్డి గారిని అభినందించాలి. అయితే సంకలనం చేసిన పద్ధతితో విభేదించాల్సి వుంది. సంకలనాల వుద్దేశ్యం కేవలం రచయిత రచనలన్నీ ఒకచోట దొరికేలా చేయడం మాత్రమే కాదు. రచయిత ఆలోచనలోని క్రమపరిణతిని ప్రతిబింబించడం మాత్రమే గూడ కాదు. మంచి రచయిత రచనల్లో ప్రతిఫలించే సమాజ పరిణతిని చూపించడం గూడ ముఖ్యమయిన అవసరం. అందుకోసం సంకలనం కాలక్రమానుసార ప్రాతిపదిక మీద

చేయడం సరయిన పని. ఇతర రచయితల మాట ఎట్లాగున్నా, కుటుంబరావు వంటి రచయితకు ఇది చాల అవసరం. అట్లాకాకుండ, ఈ సంపుటిలో 1946 నుండి 1978 వరకు రాసిన రచనలున్నాయి. కొన్నింటికి మొదట ముద్రించిన తేదీ తెలీదు, కేవలం ఏదో ఒక సంకలనంలో ప్రచురించిన తేదీ మాత్రమే వుంది. ఆరు కథలకు ఆ తేదీ గూడ లేదు. ఇది ఎంత వరకు సంపాదకుని అసహాయతను సూచిస్తుందో ఎంత వరకు ఆయన పరిశ్రమలోని లోపాన్ని సూచిస్తుందో వారే చెప్పాలి.

కుటుంబరావు కథలన్నిటిలోనికీ 1940 లలో రాసినవి ఉత్తమమయినవంటే బహుశా ఎవ్వరూ అభ్యంతరం చెప్పకపోవచ్చు. ఆ కథలకు ప్రేరణనిచ్చింది, 1930 లలో అంతర్జాతీయంగా ఏర్పడ్డ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం ఫలితంగా మనదేశపు మధ్యతరగతి ప్రజలకు కలిగిన ఇక్కట్లని గూడ ఇప్పటికి చాలా మంది గుర్తించారు. అయితే నా దృష్టిలో కుటుంబరావు కథలకు అంతకంటె సన్నిహితమయిన మరొక ప్రేరణ వుంది. ఆర్థిక సంక్షోభం ఈ ప్రేరణకు నేపథ్యం మాత్రమే.

1940ల నాటి కుటుంబరావు కథల్లో మనకు చాలా తరచుగా తారసపడే పాత్ర ఒకటి వుంది. ఇతను మొదట్లో మధ్యతరగతి మనిషి. చుట్టూ వున్న మధ్య తరగతి మనుషుల్లాగా తానుగూడ ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఇబ్బందులకు గురవు తాడు. అప్పులను పైరవీలను ఆశ్రయిస్తాడు. ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం వస్తుంది. యుద్ధకాలంలో ఇతను ఏవో పర్మిట్లు కోటాలు లైసెన్సులు కాంట్రాక్టులు చేపట్టి ధనికుడవుతాడు. యుద్ధం తరువాత బహుశా మధ్యతరగతిని విడిచిపెట్టి ఒక మోస్తరు పెట్టుబడిదారుగా స్థిరపడతాడు.

ఇతనొక వ్యక్తికాదు, ఒకవర్గం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఒక వర్గం గూడ కాదు, మనదేశ పెట్టుబడిదారీ వర్గ అభివృద్ధిలో ఒక దశ. ఇతను యుద్ధ కాలంలో పుట్టాడు. మొదటి ప్రపంచయుద్ధ మప్పుడూ పుట్టాడు, రెండవ ప్రపంచ యుద్ధమప్పుడూ పుట్టాడు. యుద్ధ కాలంలో సరుకుల డిమాండ్ విపరీతంగా పెరిగి పోతుంది. నిరుద్యోగులుగా వున్నవాళ్ళు సైన్యంలో చేరి ఉద్యోగాలు సంపాదించు కోవడం వల్ల, సంవత్సరానికి ఆరునెలలే పనిదొరికే పేదరైతులు సైనికులై పూర్తి సంవత్సరకాలం జీతం సంపాదించుకోవడం వల్ల, యుద్ధం నడపడం కోసం అవసర మయ్యే పరికరాల వల్ల, డిమాండు పెరుగుతుంది. బలమయిన ఆర్థిక పునాదిగల పెట్టుబడి దారీ వ్యవస్థ ఈ డిమాండును వాడుకొని ఇతోధికంగా బలపడుతుంది

గాని, పలసదేశాలలో మాత్రం వక్రపరిణామాలకు దారి తీస్తుంది. ఉత్పత్తిని పెంచే పారిశ్రామిక పెట్టుబడిదార్ల బదులు, నల్లవ్యాపారం, పర్మిట్లలోను కాంట్రాక్టులలోను బ్రోకర్ పనీ, చేసే పెట్టుబడిదార్లు పుట్టుకొస్తారు. మనదేశంలో మొదటి, రెండవ, ప్రపంచ యుద్ధాల కాలంలో ఇలాంటి వాళ్ళు కొల్లలుగా పుట్టుకొచ్చి, తరువాతి కాలంలో ఆధునిక భారత పాలక వర్గంలో ఒక భాగంగా మారారు.

ఈ నల్లబజారు పెట్టుబడిదార్లకు లంపెన్ బూర్జువా వర్గమని పేరెవరు పెట్టారో తెలీదుగాని అది చాలా చక్కగా అతికేపేరు. ఉత్పాదక శ్రమ (productive labour) చేయకుండ, ఉత్పాదక శ్రామికులను ఆపరించి జీవించే అధో ప్రపంచ నివాసులు లంపెన్ కార్మికులయితే, ఆ ఉత్పాదక శ్రామికులను దోచుకునే పారిశ్రామిక పెట్టుబడిదార్ల ప్రపంచాన్ని ఆపరించి జీవించే వీళ్ళు లంపెస్ పెట్టుబడి దార్లు. స్మగ్లర్లు, నల్లబజారువ్యాపారస్తులు, లైసెన్సులను పర్మిట్లను కాంట్రాక్టులను తిరగనమ్ముకునే బ్రోకర్లు, ఘరానా డాకర్లు, ఈ వర్గానికి చెందుతారు. వీళ్ళ సంస్కృతికీ లంపెన్ కార్మికుల సంస్కృతికీ తేడా లేదు. అమానుషత్వం ఈ సంస్కృతి చాలాకు ముఖ్యలక్షణం. మనదేశంలో ఈ లంపెన్ అంశలేని పెట్టుబడి దార్లెవ్వరూలేరు కాబట్టి (దొంగవ్యాపారం చేయడంలో అత్యాధునిక పరిశ్రమల యజమాన్లు కాంట్రాక్టర్లకు ఏమాత్రం తీసిపోరు), మనదేశ బూర్జువా సంస్కృతిలో తొలినాటి ఉదారవాదం కంటే లంపెన్ లక్షణాలే ఎక్కువ. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సిమెంటును దొంగవ్యాపారంచేసి పట్టుబడ్డ దొంగ కాంట్రాక్టరు సుబ్బరామిరెడ్డి హైదరాబాద్ నగర సాంస్కృతిక రంగానికి రెండేళ్ళపాటు ఏకచ్ఛత్రాధిపతి కావడం యాదృచ్ఛికంకాదు. ఆ సంస్కృతి అతనిదే కాబట్టి దానికి అతనే అధ్యక్షత వహించడం సబబు.

తన చుట్టూ పున్న మధ్య తరగతి జనంలోంచి యుద్ధకాలంలో ఈ వర్గం పుట్టి పైకి రావడం గమనించడంతోనే కుటుంబరావుకు ప్రపంచం అర్థమయిందని నా అనుమానం. కుటుంబరావు 'కాపిటల్' 1942లో చదవడం గూడ కాకతాళీయంకాదు. 1942 నాటికి సరిగ్గా యుద్ధం తీవ్రదశనందుకుంది. అప్పటికే కాంట్రాక్టులమీద కోటాలమీద పర్మిట్ల మీద నల్లబజారులోను చేసుకోవలసిన వాళ్లు చేసుకోవలసినంత లాభం చేసుకున్నారు.

తనకు తన సమాజవాస్తవ స్వరూపాన్ని ఏ పరిణామం తెలియబరిచిందో,

దాన్ని కుటుంబరావు తన కథల్లో చక్కగా పొందుపరిచాడు. 1940 లలో ఆయన రాసిన చాలా కథల్లో ఈ లంపెన్ బూర్జువా వర్గానికి చెందిన వ్యక్తులు ప్రధానంగా కనిపిస్తారు. ఈ సంపుటిలో అటువంటి కథలు ఆరు వరకు ఉన్నాయి.'సద్యోగం' లో సూర్యనారాయణ, 'అట్టడుగు'లో గణపతి, :'కలిసిరావాలి'లో : రంగయ్య, 'షావుకారు సుబ్బయ్య'లో సుబ్బయ్య, 'పైకివచ్చినవాడు'లో సీతరామరావు, 'శిలపరిశీలన' లో కథకుడు, ఈ వర్గానికి ప్రతినిధులు. అయితే వీళ్ళు ఆయా కథల్లో ముఖ్యమయిన పాత్రలేగాని కథానాయకులు కారు. కథానాయకుడు ఎప్పుడూ గూడ మామూలు మధ్య తరగతి మనిషి. యుద్ధం పూర్వం కుటుంబరావుకుమల్లే అతను గూడ అమాయకుడు, అంటే ప్రపంచ స్వరూపం తెలీనివాడు. యుద్ధం జరుగుతూండగా, తిండికి గతిలేని గణపతి, చిల్లర వ్యాపారస్తుడు సుబ్బయ్య కాంట్రాక్టులు చేపట్టి, పర్మిట్లు తిరగనమ్మి' రాత్రికి రాత్రే ధనికులు కావడం చూస్తాడు. చూసి ప్రపంచ స్వరూపాన్ని అర్థం చేసుకుంటాడు.

అర్థమయితే చేసుకుంటాడు గాని తిరగబడడు. సాహిత్యం ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపాలని కొందరుచేసే వాదనను కుటుంబరావు ఆమోదించారో లేదోగాని, తనతొలినాటి రచనలలో ఆచరించలేదు. మధ్యతరగతి నుండి పైకి వెళ్ళిన లంపెన్‌బూర్జువా వర్గాన్ని మధ్యతరగతి 'మంచివాళ్ళ' కళ్ళతోనే చూపించడం వల్ల ఇక్కడ నిజానికి తిరుగుబాటుకు ఆస్కారంలేదు. 'పై కివచ్చినవాడు' లో రాఘవులుకు, తన తమ్ముడు సీతారామారావు సప్లయిశాఖలో లంచాలు సంపాదించి కోటాలు తిరగనమ్మి ధనవంతుడయి వుండవచ్చుగాని, 'డ్లాకుచేసే బాడుఖావు' కాదు, ఎంత చెడ్డా తనతమ్ముడే. అతనితో నవ్వుతూనే మాట్లాడతాడు. ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు గూడ. చివరికి మనకుదొరికే 'పరిష్కారం', కమ్యూనిస్టయిన రాఘవులు అల్లుడు, సీతారామారావు మామగారిమీద ఎలెక్షనులో పోటీచేసి ఓడించడమే.

మరొక ఉదాహరణ 'సద్యోగం' లో కథకుడు. ఒకప్పుడు పేదవాడిగావున్న తనమిత్రుడు సూర్యనారాయణ ఘరానా స్త్రీలకు డాఫర్ పనిచేసి ధనికుడయ్యాడని తెలుస్తుంది. అసహ్యించుకుంటాడు. కాని అంతలో మధ్యతరగతి 'మంచివాడి' మొగమాటం అడ్డువస్తుంది. దేశంలో తన మిత్రుడిలాంటి వారు ఎంతమందిలేరు? వాళ్ళను తాను ఏమనగలిగాడు, ఏంచేయగలిగాడు? అన్నీ అమ్మకపు సరుకులైన తరువాత మనిషి మాంసం అమ్మకపు సరుకయితే వచ్చిందా? ఇత్యాది. చివరికి, మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతీక అయిన ప్రశ్నతో తన ఆలోచన ముగించుకుంటాడు'నాకెందుకు మధ్యపేచీ?'

'కలిసిరావాలి'లో రంగయ్య మరీ అన్యాయమయిన మనిషి. యుద్ధకాలంలోనే కాదు,అంతకు పూర్వంగూడ కాటకం వచ్చినప్పుడు వడ్డీవ్యాపారం చేసి లక్షలు కూడబెడతాడు. అయినా కథకుడిలో అతని పట్ల ద్వేషం కనిపించదు. విషప్పురుగును జీవశాస్త్రజ్ఞుడు ప్రయోగశాలలో చూసినట్లు నిర్లిప్తంగా చూస్తూ, అతనిలో 'తాత్విక క్షీణత'ను మాత్రం గమనిస్తాడు. అధికారమార్పిడి అనంతరం వచ్చిన మార్పులకు రంగయ్య సర్దుబాటు చేసుకోలేక తన ఆస్తిని కోల్పోతే అందులో కొంత తనకూ దక్కుతుందేమోనన్న క్షుద్రమయిన ఆశగూడ వ్యక్తపరుస్తాడు.

లంపెన్‌బూర్జువా వర్గాన్ని ఆ వర్గానికి సామాజికంగా సన్నిహితమయిన మధ్యతరగతి కళ్ళతో చూపించడం వల్ల అనివార్యంగా ఏర్పడే శైలి, వ్యంగ్యానికి ప్రాధాన్యతనిచ్చే వాళ్ళకు సంతృప్తి కలిగించవచ్చును గాని, మార్క్సిస్టు దృక్పథం నుండి ఒక తీవ్రమయిన పరిమితిగానే పరిగణించాలి. ఆ పరిమితే బూర్జువా విమర్శకులకు కుటుంబరావు పట్ల ఉండే సద్భావానికి కారణం (ఉదాహరణకు, వాళ్ళు కుటుంబరావు పట్ల చూపుతున్న ఆదరణ అల్లంరాజయ్యకు ఎన్నటికీ చూపరని నా అనుమానం).

ఆనాడు భారతదేశంలో వర్గ పోరాటం తీవ్రంగాలేని మాట వాస్తవమే. అయినా ఈ లంపెన్‌బూర్జువా వర్గాన్ని దాని చీకటి వ్యాపారానికి బలిఅయిన పేదవాళ్ళ కళ్ళతో చూపించి వుంటే మరికొంత న్యాయంగా వుండేది. ఈ పరిమితిని కుటుంబరావు 1970 తరువాత కాలపు వ్యాసాలలో అధిగమించాడు, కాని ఆ వ్యాసాలు 'విశాలాంధ్ర' వారిచేతిలో సంకలనానికి నోచుకుంటాయా అంటే అనుమానమే.

ం ం ం

ఈ లంపెన్ బూర్జువా వర్గపు పుట్టుకే కాకుండా ఇతర ఇతివృత్తాలు....మన సమాజ జీవితాన్ని మరికొంత సాధారణస్థాయిలో ప్రతిబింబించేవి— గూడ వున్నాయి. క్షీణిస్తున్న ఫ్యూడల్ ఆచారాలు, అంకురిస్తున్న బూర్జువా విలువలు, వ్యాపారదృష్టి, చాలాకథలకు ఇతివృత్తాలు సమకూర్చిపెట్టాయి. 'శాస్త్రీయసంగీతం' అనబడే ఫ్యూడల్ సంగీతం మీద మోజుతో చదువుపాడుచేసుకొని ఇల్లువదిలి మద్రాసుపారిపోయి చివరికి ఇళ్ళస్థలాలు అమ్ముకునే వ్యాపారంలో స్థిరపడ్డ గోపాలం ('దైవాధీనపు జీవితం'), అత్తగారి పుళ్లో అత్తగారి సాంప్రదాయికపు పెత్తనాన్ని నిరసించి,పట్టణం వచ్చాకమాత్రం అక్కడి కిరాయి ఇళ్ళ వ్యాపార

చీదరను సవ్వుతూ భరించే శారదాంబ ('అద్దెకొంప'), ఈ మార్పుకు ప్రతీకలు. మరొక ఉదాహరణ, 'నవమంత్రపుసిరి' నాటికలో శాస్త్రి. చదువు చెప్పడం పట్ల ఆసక్తితో ట్యుటోరియల్ కాలేజి పెడతాడు శాస్త్రి. మొదటి సంవత్సరం అందరూ పాసయినందుకు సంతోషిస్తాడు. మరొక టీచర్ని గూడపెట్టి ఎక్కువమంది విద్యార్థుల్ని తీసుకోవాలనుకుంటాడు. అయితే అతనిలాగ వృత్తిపట్ల శ్రద్ధతో కాకుండా వ్యాపారదృష్టితో పనిచేసే దాసు అతని తరువాత టీచరుగా చేరిన సీత,సినిమా ఛాన్సు దొరకగానే అర్ధాంతరంగా ఉద్యోగం వదిలిపెట్టి వెళ్ళిపోతారు. దానితో చదువు పాడయి తరువాతి సంవత్సరం సగం మందికి పైగా ఫెయిలవుతారు. గత్యంతరం లేక శాస్త్రి స్కూలు మూసేసి, తాను తన స్వార్థానికి బుద్ధిపూర్వకంగా ఇంకొకర్ని బలిచేయలేదన్న సంతృప్తిని మాత్రం మిగుల్చుకుంటాడు.

అయితే అందరికంటే చక్కటి ఉదాహరణ, 'నువ్వులు-తెలకపిండి'లో సోమయాజులు. అతవుక్ని చెట్లనీ పూలనీ చూసి సహజంగా పొందే ఆనందం అతను పాటలు పాడడంలో పొందేవాడు, చిన్నప్పుడు. అంత సహజంగాను అతని పాటను ప్రేమించి అతన్ని పెళ్ళిచేసుకుంటుంది జయలక్ష్మి. అయితే అతవుక్ని వ్యాపారం చేసుకునే కాంట్రాక్టర్లున్నట్టే పాటను వ్యాపారం చేసుకునే నాటకాల కాంట్రాక్టర్లు, సినిమా నిర్మాతలు, వున్నారు. సోమయాజులు వాళ్ళ చేతుల్లో పడతాడు. తనపాటతో వాళ్ళకు లక్షలు సంపాదించి పెడతాడు. తాను మాత్రం డబ్బు చేసుకోడు సరికదా, పాడడంలోగల ఆనందాన్నీ, తాను పాడగా విని భార్యపొందే ఆనందాన్నీ సహితం కోల్పోతాడు. వ్యాపార గానుగనుండి వట్టి నిస్సారమయిన తెలికపిండిగా బయట పడతాడు.

ప్రపంచ వ్యాప్తంగా ఫ్యూడలిజం నశించి దాని అవశేషాల నుండి పెట్టుబడి దారీ సమాజం పుట్టే పరిణామం గత నాలుగు శతాబ్దాలుగా సాగుతోంది. అన్ని దేశాల ఆధునిక చరిత్రలోను గొప్ప రచయితలగా పేరు పొందిన వాళ్ళలో చాల మంది ఈ పరిణామాన్ని వ్యక్తీకరించిన వాళ్ళే. **Miguel Cervantes** నుండి కుటుంబరావు వరకు ఈ జాబితా చాలా పెద్దది. అయితే మార్క్సిస్టయిన కుటుంబరావులో ఇక్కడ ఒక ప్రత్యేకత వుంది. ఈ చారిత్రక పరిణామం ఆస్తిపరులలో కలిగించిన మార్పును మాత్రమే కాకుండ, శ్రామిక జనంలో కలిగించిన మార్పును గూడ చక్కగా చూపించిన కొద్దిమంది రచయితలలో కుటుంబరావు ఒకడు. ఈ దృష్టి నుండి చూస్తే, ...నా జీవితం' చాలా విలక్షణమయిన కథ.

విఠల్‌పాండురంగ్ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. అతని మాటల్లో చెప్పాలంటే, 'ఇంటిదగ్గర తన వాళ్ళు గౌరవ కుటుంబీకులు'. అంటే అర్థం, ఒకప్పుడు సుమారుగా భూమి ఉన్నవాళ్ళు. క్రమంగా భూమి కోల్పోయారో,కుటుంబం పెరిగిందో, తెలీదుగాని, అప్పులపాలయ్యారు. అప్పుతీర్చేందుకు కొంతడబ్బు సంపాదిద్దామని విఠల్ పట్టణం వచ్చి ఫాక్టరీలో హమాలీ పనిలో చేరతాడు. అన్ని దేశాలలోనూ ఈ రకంగా చితికిపోయిన రైతాంగంనుండే పారిశ్రామిక కార్మికవర్గం ఏర్పడింది.

పట్టణంలో మొదటిరోజు జరిగే సంఘటనలోనే కుటుంబరావు విఠల్ జీవితం లోని మార్పును చక్కగా చూపుతాడు. తమ అవసరాలకోసం తాము శ్రమించే మధ్యతరగతి రైతుకుటుంబానికి చెందిన విఠల్‌కు, వీలయినంత ఎక్కువగా పని చేయడం అలవాటు. గంట పనిని అరగంటకు కుదించడం వీలయితే కుదించాలని చూస్తాడు. ఫాక్టరీలో శ్రమించేది తనకోసం కాదని, యజమాన్ల లాభాలకోసమని, అర్థం కాక ఆ దృక్పథాన్నే ఇక్కడా ప్రదర్శిస్తాడు. లోహపు అచ్చుల్ని లారీ నుండి గోదాముకు చేరవేసేటప్పుడు, ఒకేసారి మూడు అచ్చుల్ని మోయవచ్చునని తోచి తోటి కూలీతో ఆమాట చెప్పి, 'చాల్లే, గొప్పపనివాడివి!' అని కసిరించుకుంటాడు.

త్వరలోనే ఫాక్టరీలో సమ్మె జరుగుతుంది. ఒక కూలీని పనినుండి తీసివేస్తే మిగిలినవాళ్ళకు వచ్చిన నష్టమేమిటో, వాళ్ళెందుకు సమ్మె చేయాలో విఠల్‌కు అర్థం కాదు. ఏ కుటుంబం అవసరాలు ఆ కుటుంబం చూసుకునే మధ్యతరగతి రైతాంగ సంస్కృతికి చెందిన విఠల్‌కు కార్మికుల జీవన పరిస్థితులే వాళ్ళను సంఘటిత పరుస్తాయని, సంఘటిత శక్తే వాళ్ళ ఆయుధమని అర్థంకావడానికి కొంత సమయం పడుతుంది. అర్థంకాక, సమ్మె విచ్ఛిన్నకారులతో కలిసి ఫాక్టరీకిపోయి, యజమాని మన్ననలు అందుకోకపోగా, సమ్మె చేసిన కార్మికులతో తిట్లుతింటాడు.

అయితే డబ్బుకు విలువయిచ్చే పెట్టుబడిదారీ సమాజ మనస్తత్వాన్ని త్వర లోనే విఠల్ అలవర్చుకుంటాడు. ఇంటిదగ్గర ఉన్న బాకీ రెండువందల యాభైరూపా యలు తీర్చడం కోసం నెలకు పదిరూపాయలపైగా మిగిలించి ఇంటికి పంపుతాడు. కొంతకాలం తరువాత తల్లికి ఒంట్లో బాగులేదని తెలిసి ఇంటికిపోతాడు. తాను పంపిన డబ్బుతో కొంతయినా అప్పుతీరి వుంటుందనుకుంటాడు. కాని ఇల్లు చేరి పరిస్థితి చూసాక బాధపడతాడు. తన తల్లి ఆ డబ్బుతో అప్పుతీర్చకపోగా, చాదస్తపు ఆచారా లకు ఖర్చుపెట్టిందని కోపగించుకుంటాడు. ఇక్కడున్నది **బూర్జువా** విలువలకు

ఫోకస్:

మృత్యు శిఖరం మీద

యు.ద్ధఫిరంగి

ప్రజాపోరాటాల్లో పదునెక్కి, ప్రభుత్వ నిర్బంధాల్లో రాటుదేలిన ప్రజాకవి చెరబండరాజీనాడు గాంధీ వ్యాధిగర్భగుడి (Ga dh H spital లో మృత్యు శిఖరం మీద యుద్ధ ఫిరంగిలా నిద్రోతున్నాడు, నిద్రోయే బాంబు ఎప్పుడు బ్రద్దలవు తుందో తెల్వదు. చెరబండరాజు దీర్ఘకాలికంగా ఈ దోపిడి వ్యవస్థకు మరణశాస నాన్ని రాస్తూ వస్తున్నాడు. అతని చేతులు కట్టెయ్యాలని, నోరు నొక్కెయ్యాలని, కాళ్ళు నరికెయ్యాలని, ఉద్యోగంతీసి, జైల్లోవేసి, కేసుల్లో త్రోసి, విఫల ప్రయత్నం చేసి చివరికి మెదడులో ట్యూమర్‌గా ప్రవేశించాయి ఇద్దరు క్రిముల విషపు సూదులు. శ్వాస ఆగేంతవరకు తన ప్రజారాజకీయ విశ్వాసాన్నొదులుకోనంటున్న చెరబండరాజీ నాడెందుకక్కడున్నాడు ?

మీరు కళ్ళు తెరుచుకొని మీ చుట్టూ వున్న తెల్లప్రపంచాన్ని చీల్చుకొని కాస్త బయటకొచ్చి చూస్తే కార్మికుని నోళ్ళల్లో, కర్షకుల గూళ్లల్లో, విద్యార్థుల కళ్ళల్లో, విప్లవకారుల ఉపన్యాసాల్లో చెరబండరాజు కన్పిస్తాడు. కొంగుసడుముకు చుట్టి, కొడ

ఫ్యూడల్ విలువలకు సంఘర్షణ అని గుర్తించలేక, తన శ్రమను వీళ్ళు గౌరవించ లేదని కోపగించుకుని, ఫాక్టరీలో కూలీలు సమ్మె సమయంలో చూపిన పరస్పర ఆదరాన్ని గుర్తుతెచ్చుకుని, మళ్ళీ ఇంటికి ఒక్క పైసగూడ పంపకూడదని నిర్ణ యించుకుని తిరిగి పట్టణానికి వస్తాడు. కుటుంబరావు మాటల్లో చెప్పాలంటే, ఈసారి అతను 'నిజమయిన పారిశ్రామిక కార్మికుడుగా' పట్టణం ప్రవేశించాడు. బి. జి

(కుటుంబరావు సాహిత్యం- మొదటి సంపుటంలోని కథలు మాత్రమే ఇందులో సమీక్షించబడ్డాయి.)

కుటుంబరావు సాహిత్యం-మొదటి సంపుటం- సంపాదకుడు. కేతువిశ్వనాథరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ ప్రచురణ (జనవరి 1982, పేజీలు : 422+32, వెల రు. 25-00, 1/8 డెమ్మీ, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 520 004.